APTEL /25/A2860

E వార్త NEWS

సీమ వార్త
తెలుగు దినపత్రిక

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 156 | పేజీలు : 4 | శనివారం 14 మార్చి 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 5/-

**విలేకరులు కావలెను**

సీమ వార్త తెలుగు దినపత్రిక ఏపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల వారీగా బ్యూరో ఇన్చార్జులు స్టాఫ్ రిపోర్టర్లు ఆర్సి ఇన్చార్జిలు వెంటనే కావలెను అర్హత కనీసం డిగ్రీ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

వివరాలకు సంప్రదించండి

చీఫ్ ఎడిటర్ బీరె ఈశ్వరయ్య
9490860881



## దేశరైతులను ఆదుకోవడానికి కృషి

- కాంగ్రెస్ మాత్రం అసత్య ప్రచారాలకే పరిమితం
- అసోంలో ప్రధాని మోదీ పర్యటన
- పీఎం కిసాన్ నిధులు రిలీజ్
- ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించిన మోదీ

# రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్



- సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణానికి రూ. 2,316 కోట్లు
- డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్ ఇరిగేషన్‌పై 90 శాతం సబ్సిడీ
- ఎఫ్ఆర్ఏ పట్టాదారులకు రాయితీలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం
- ఏపీ కేబినెట్‌లో పలు పనులకు ఆమోదం
- మిషన్ శక్తి పథకం కింద ఆస్పత్రులు నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం

**అమరావతి**

రాజధాని అమరావతిలో శాశ్వత సచివాలయం, హెచ్ఓడీ టవర్ల నిర్మాణాలకు సంబంధించి పనుల కోసం రూ.2,316 కోట్లకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులిచ్చింది. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. రూ.119 కోట్ల వ్యయంతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రాజధాని - మిగతా3లో



### ఏపీ హై కోర్టు న్యాయమూర్తిగా

# జస్టిస్ లీసా గిల్ బాధ్యతల స్వీకరణ

### తదుపరి హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆమె

### ప్రమాణం చేయించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

**అమరావతి**

ఏపీ హై కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీ హై కోర్టు మొదటి కోర్టు హాల్ లో న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ చేత హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ లీసా గిల్ పంజాబ్, హర్యానా హై కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ ఏపీ హై కోర్టుకు బదిలీపై వచ్చారు. ఏపీ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ - మిగతా3లో



## ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

- కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీల దుకాణం
- కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే: మోదీ
- రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోదీ
- రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపిన ప్రధాని

# రాజ్యాంగం ప్రజల గొంతుక

- గాడ్సే, వీర్‌సావర్కర్‌ది కాదు
- 'సిద్ధాంతాల విషయంలో కాన్షీరామ్ ఎప్పుడూ రాజీపడలేదు'
- సంవిధాన్ సమ్మేళన్ కార్యక్రమం
- కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ- కేంద్రంపై విమర్శలు
- అమెరికాలో దాఖలైన న్యాయపరమైన కేసు అదానీపై కాదు, బీజేపీపైనే



# ఏపీలో టైటానియం ఉత్పత్తి

### బీచ్‌శాండ్ మినరల్స్ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం

### ప్రత్యేక పాలసీ తీసుకొచ్చేందుకు కూటమి సర్కార్ కసరత్తు

### పెట్టుబడులతో పాటు భారీగా ఉపాధి అవకాశాలు



**అమరావతి**

విమానాల తయారీ, రక్షణ సంబంధిత పరిశ్రమలు మొదలైన వాటిలో కీలకంగా ఉపయోగించే టైటానియం పిగ్మెంట్ మెటల్‌ను ఇకపై దేశీయంగానూ ఉత్పత్తి చేయాలని, దీనికి ఆంధ్రప్రదేశ్ ముఖ్య వేదిక కావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకుగాను దీనికి సంబంధించిన ప్రయత్నాలన్నింటినీ ప్రారంభించింది. అయితే బీచ్‌శాండ్ మినరల్స్‌ను శుద్ధిచేసి వీటి నుంచి టైటానియం ముడి ఖనిజాన్ని తయారు చేసేంత వరకు సంబంధిత పరిశ్రమలన్నీ ఏపీలో ఏర్పాటయ్యే విధంగా చూసేందుకు ప్రభుత్వం ఇప్పటికే తన కసరత్తును ప్రారంభించింది. ఇందులో పెట్టుబడులను పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చినట్లయితే వాటికి పూర్తి సహకారాన్ని అందించే విధంగా బీచ్‌శాండ్ విధానాన్ని అందుబాటులోనికి - మిగతా3లో



## భయంతో ఎవరూ గ్యాస్ బుక్ చేయొద్దు

- దేశంలో ఎల్‌పీజీ కొరత లేదు: కేంద్రం
- ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలకు 48వేల కిలో లీటర్ల కిరోసిన్
- కమర్షియల్ సిలిండర్ల ప్రాధాన్యతా పంపిణీ బాధ్యత రాష్ట్రాలదే
- వాణిజ్య వినియోగదారులంతా పీఎన్‌జీ కనెక్షన్లు తీసుకోవచ్చు
- భారత చమురు శాఖ కీలక ప్రకటన

# అమరావతిలో బిట్స్ పిలానీ 'ఏఐ ప్లస్ క్యాంపస్'




- నిర్మాణ ప్లాన్లు పరిశీలించిన మంత్రి లోకేశ్
- అమరావతిలో బిట్స్ పిలానీ నిర్మాణ ప్లాన్లు పరిశీలించిన మంత్రి లోకేశ్
- లోకేష్‌ను కలిసి క్యాంపస్ ప్లాన్లు చూపించిన బిట్స్ పిలానీ ప్రతినిధులు
- క్యాంపస్‌లో ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్ కోర్సులు ఉంటాయన్న ప్రతినిధులు

**అమరావతి**

అమరావతిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బిట్స్ పిలాని ఏఐ ప్లస్ క్యాంపస్ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్లను మంత్రి నారా లోకేశ్ పరిశీలించారు. బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్. చెన్నవీర్, బీఎస్ సహాని ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్?ను కలిసి బిట్స్ ఏఐ క్యాంపస్ ప్లాన్లను ప్రదర్శించారు. ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ కోర్సులు అమరావతి క్యాంపస్‌లో ఉంటాయని ప్రతినిధులు - మిగతా3లో

# తప్పనిసరి నెలసరి సెలవులపై పిటిషన్

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు. జస్టిస్ సూర్యకాంత్ బెంచ్ వ్యాఖ్య
- నెలసరి సెలవులు తప్పనిసరి చేస్తే వారికి ఉద్యోగాలు ఇవ్వరు
- చట్టం చేస్తే తాము పురుషుల కంటే తక్కువ అన్న భావన మహిళల్లో కలిగే అవకాశం
- చట్టం ద్వారా నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం వల్ల కలిగే సామాజిక పరిణామాల గురించి ప్రధాన న్యాయమూర్తి ఆందోళన



# రాజ్యాంగం ప్రజల గొంతుక

రాజ్యాంగం ప్రజల గొంతుకని, నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్‌లది కాదని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సిద్ధాంతాన్ని పాటించరని ఆరోపించారు. ఉత్తర్‌ప్రదేశ్ లఖ్‌నవూలో జరిగిన సంవిధాన్ సమ్మేళన్‌లో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "నిన్న పార్లమెంట్‌లో నేను ఎప్‌స్టీన్ అనే పదాన్ని ఉచ్చరించాను. దేశంలో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేనందున ఈ సమస్య ఇంధన భద్రతకు సంబంధించినదని చెప్పాను. దేశ ఇంధన భద్రతలో మోదీ రాజీపడ్డారు. ఇంధన భద్రతలో ఎందుకు రాజీ పడ్డారు? అని కేంద్రాన్ని ప్రశ్నించాను. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా హర్దీప్‌సింగ్ పూరీని నియమించారు. ఇది అమెరికాతో పడిన మొదటి రాజీ. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పూరీ పేరు ఉంది. ఆయన ఎప్‌స్టీన్‌కు ఫ్రెండ్" అని రాహుల్ పేర్కొన్నారు.

అమెరికా కోసం మోదీ పనిచేస్తున్నారు : రాహుల్

ప్రధాని నరేంద్ర మోదీ ఎప్‌స్టీన్, గౌతమ్ అదానీతో రాజీ పడడం వల్ల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భారత్ ప్రయోజనం పొందలేకపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ ఇకపై భారతదేశ ప్రధాని కాదని, ఆయన అమెరికా కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. తాను నిన్న (గురువారం) పార్లమెంట్‌లో నిజాలు మాట్లాడుతుంటే, మోదీ లోక్‌సభ నుంచి వెళ్లిపోయారని అన్నారు. "కాంగ్రెస్ పేదల పార్టీగా మారింది. అదే సమయంలో బీజేపీ మాత్రం ధనవంతుల పార్టీగా మారింది. బీజేపీ, మోదీ దేశ సంపద మొత్తాన్ని అదానీ చేతుల్లో పెట్టేశారు. అమెరికాలో దాఖలైన న్యాయపరమైన



కేసు అదానీపై కాదు, బీజేపీపైనే. దీన్ని ఆసరాగా చేసుకుని వాణిజ్య ఒప్పందంపై అమెరికా భారత్‌పై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా మోదీ ఇప్పుడు అమెరికా కనుసన్నల్లో పనిచేస్తున్నారు. పార్లమెంటు నుంచి హఠాత్తుగా బయటకు వెళ్లి, మరెవరినీ సంప్రదించకుండానే కేవలం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి మోదీ ట్రేడ్ డీల్‌ను ఖరారు చేశారు" అని రాహుల్ విమర్శించారు. "దేశం పురోగతి సాధిస్తుంటే అందులో పేదలు వారి నేపథ్యంతో సంబంధం లేకుండా ఉండాలి. దేశంలోని 500 అతిపెద్ద కంపెనీల జాబితాను రూపొందించండి. అందులో సీఈఓలు, పెద్ద పెద్ద స్థాయిలో ఉన్నవారిని గుర్తించండి. అప్పుడు ఎన్ని కంపెనీల్లో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, ఈబీసీలు, మైనార్టీలు సీఈఓ, పెద్ద పొజిషన్‌లో ఉన్నారో చూడండి. ఒక్కరూ కూడా ఉండరు. అలాగే అదానీ గ్రూప్ సంస్థల ఉద్యోగుల జాబితాను చూడండి. అక్కడ పెద్ద హోదాలో ఒక్క దళితుడు, వెనుకబడిన తరగతి, ఎస్టీ వ్యక్తి కనిపించరు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోని ప్రచారక్‌లను చూడండి. అక్కడ ఓబీసీ, దళిత, ఆదివాసీ వర్గాలకు చెందిన ఒక్క ప్రచారక్ కూడా మీకు కనిపించరు. ఇదే బీజేపీ రాజకీయ విధానం."

'సిద్ధాంతాల విషయంలో కాన్షీరామ్ ఎప్పుడూ రాజీపడలేదు'

కాన్షీరామ్ తన సిద్ధాంతాల విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని రాహుల్ గాంధీ తెలిపారు. ఒకవేళ ఆయన అలా చేసి ఉంటే ఆయన చిత్రపటం ఇక్కడ ఎప్పటికీ ప్రదర్శితమయ్యేది కాదన్నారు. ఈ రోజు కాన్షీరామ్ స్మరించుకుందామని అన్నారు. ఆయన పోరాటం, దార్శనికత దేశ రాజకీయాలపై ప్రభావం చూపిందన్నారు. మన ఆలోచనల కోసం పోరాడకపోతే ఏమీ సాధించలేమన్నారు. "ఈ ప్రసంగం చేసే ముందు బాబాసాహెబ్ అంబేడ్కర్ విద్య గురించి ఎలా మాట్లాడేవారో నేను ఆలోచిస్తున్నాను. ఆయన సంస్థాగత ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. కాన్షీరామ్ రాత్రిపూట ఉత్తర్‌ప్రదేశ్ అంతటా తిరిగేవారు. ఆయన తనతో ఒక పెన్ను తీసుకెళ్లేవారు. సమాజంలోని 15 శాతం మంది కచ్చితంగా ప్రయోజనం పొందుతున్నప్పటికీ 85 శాతం మంది కూడా ప్రయోజనం పొందే విధంగా పెన్ను ఉండాలని అభిప్రాయపడేవారు. కానీ ఇప్పుడు ఏమి జరిగింది? బీజేపీ ఒక కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టింది. బీజేపీ పెన్ను నుంచి దాని క్యాప్‌ను వేరు చేసింది. క్యాప్‌ను పక్కన పెట్టింది. ఇప్పుడు పెన్ను మాత్రమే పట్టుకుని తిరుగుతుంది. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఇప్పుడు జీవించి ఉంటే కాన్షీరామ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయి ఉండేవారు" అని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు.

# భయంతో ఎవరూ గ్యాస్ బుక్ చేయొద్దు

దేశంలో ఎల్‌పీజీ వంటగ్యాస్ కొరత లేదని, భయంతో ఎవరూ గ్యాస్ బుక్ చేయొద్దని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజలు భయాందోళనతో వెంటవెంటనే ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్స్ చేస్తున్నారని భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి(మార్కెటింగ్, ఆయిల్ రిఫైనరీ) సుజాత శర్మ తెలిపారు. మిడిల్ ఈస్ట్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ప్రతిరోజు దాదాపు 55.7 లక్షల ఎల్‌పీజీ బుకింగ్స్ జరిగేవని, ఇప్పుడు వాటి సంఖ్య ఏకంగా 75.7 లక్షలు దాటిందన్నారు. ప్రజలు భయాందోళనతోనే భారీ బుకింగ్స్ చేస్తున్నారని ఈ గణాంకాలతో స్పష్టమవుతోందని ఆమె చెప్పారు. ఇంతగా ఆందోళన అక్కర్లేదని, దేశంలోని 25వేల ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లలో ఏ ఒక్కరి దగ్గరా గ్యాస్ స్టాక్ పూర్తిగా అయిపోలేదని సుజాత శర్మ స్పష్టం చేశారు. శుక్రవారం దిల్లీలో కేంద్ర మంత్రిత్వ శాఖల సంయుక్త మీడియా సమావేశంలో ఈవివరాలను ఆమె వెల్లడించారు.

**పెట్రోలు, డీజిల్‌ల తయారీలో స్వయం సమృద్ధి**

"దేశంలోని అన్ని పెట్రోలు బంక్‌లకు పెట్రోలు, డీజిల్‌ల సప్లై నిలకడగానే జరుగుతోంది. అన్ని బంక్‌లలోనూ పెట్రోలు, డీజిల్ లభిస్తున్నాయి. పెట్రోలు, డీజిల్‌ల తయారీలో భారత్ స్వయం సమృద్ధిని సాధించింది. ఏటా 258 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును శుద్ధిచేసే కెపాసిటీ భారతదేశ రిఫైనరీలకు ఉంది. ప్రస్తుతం దేశంలోని అన్ని రిఫైనరీలు 100 శాతం కెపాసిటీతో పనిచేస్తున్నాయి. మన



దేశ రిఫైనరీల దగ్గర తగినన్ని ముడి చమురు నిల్వలు కూడా ఉన్నాయి. అందుకే పెట్రోల్, డీజిల్ సప్లైలో ఇబ్బంది ఏర్పడదు. మార్చి 5 నుంచి డొమెస్టిక్ ఎల్‌పీజీ ఉత్పత్తిని 30 శాతం పెంచాం. ప్రజల ఇళ్లకు వంటగ్యాస్ సప్లైలో అవాంతరం లేకుండా చూసేందుకే ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుంది" అని భారత చమురు శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ పేర్కొన్నారు.

**వాణిజ్య వినియోగదారులంతా పీఎన్‌జీ కనెక్షన్ తీసుకోవచ్చు!**

"అయితే ఇప్పటికీ ఎల్‌పీజీ పరిస్థితి అనేది భారత ప్రభుత్వానికి ఆందోళనకర అంశంగానే ఉంది. దేశంలోని గృహాలకు పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) సప్లై అంతరాయం లేకుండా జరుగుతోంది. ప్రస్తుతం భారత్‌లో 1.5 కోట్ల పీఎన్‌జీ డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రధాన నగరాల్లోని సింహభాగం వాణిజ్య వినియోగదారులకు ఎల్‌పీజీ కనెక్షన్లే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితి కారణంగా వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఇబ్బందుల తొలగింపునకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది. ఇలాంటి వాణిజ్య వినియోగదారులంతా ప్రత్యామ్నాయంగా పీఎన్‌జీ కనెక్షన్‌ను తీసుకోవచ్చు. ఇందుకోసం వారు ఆ నగరంలోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ప్రొవైడర్లు లేదా డీలర్లను సంప్రదించాలి. తద్వారా ఎల్‌పీజీ సప్లైలపై కొంత ఒత్తిడి తగ్గుతుంది" అని సుజాత శర్మ సూచించారు.

**రాష్ట్రాలకు అదనపు కిరోసిన్ : కమర్షియల్ సిలిండర్ల పంపిణీ బాధ్యత**

"కమర్షియల్ వంటగ్యాస్ సిలిండర్లను ప్రాధాన్యతా క్రమంలో పంపిణీ చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాం. సరైన కస్టమర్లకు సకాలంలో సిలిండర్లు చేరేందుకు అనుగుణంగా ప్రాధాన్యతా మార్గదర్శకాలను రూపొందించాలని మేం రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాం. ప్రస్తుత ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలకు అదనంగా 48వేల కిలో లీటర్ల కిరోసిన్‌ను మంజూరు చేశాం. మూడు నెలలకోసారి ప్రజలకు పంపిణీ చేసేందుకు రాష్ట్రాలకు మంజూరు చేసే 1 లక్ష కిలో లీటర్ల కిరోసిన్ కోటాకు అదనంగా ఈ కేటాయింపు జరిగింది. ఇంధన నిల్వలపై ప్రచారమయ్యే వదంతులను నమ్మొద్దని మేం ప్రజలను కోరుతున్నాం. భయంతో గ్యాస్ బుకింగ్స్ చేయొద్దు" అని సుజాత శర్మ సూచించారు.


# ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు.

అసోంలోని కోక్రఝర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని శిక్షించి, ఈ దేశంలో చొరబాటుదారులకు చోటు లేదనే స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని అసోం ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అనేది అబద్ధపు హామీల దుకాణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హస్తం పార్టీ చీలికలను సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. బోడోల్యాండ్‌కు చెందిన చాలా తరాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుడు కలల ప్రపంచంలో ఉంచి కాలయాపన చేసిందన్నారు. కేంద్రంలో, అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే బోడో శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీని ద్వారా అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చామన్నారు.

**బోనస్ గిఫ్టుగా నాలుగు సూపర్ అబద్ధాలు**

"కాంగ్రెస్‌కు చెందిన అబద్ధపు హామీల దుకాణంలో ప్రతీ అబద్ధపు హామీతో పాటు నాలుగు సూపర్ అబద్ధాలను బోనస్ గిఫ్టుగా ఇస్తుంటారు. ఎందుకంటే ఆ హామీలను నెరవేర్చాలనే ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బీజేపీ అసోంలో గెలిచాకే, బోడోల్యాండ్‌లో శాంతి, వికాసం మొదలయ్యాయి. బోడో వర్గం ప్రజలు భాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును తలుచుకుంటే నాకు గర్వంగా అనిపిస్తుంది. మీ ప్రేమకు నేను



రుణపడిపోయాను. ఇక్కడ అభివృద్ధి పనులు చేసి ఆ రుణాన్ని తీర్చుకుంటాను. కొన్నివారాల క్రితం, బోడో సంస్కృతితో ముడిపడిన కార్యక్రమాలను చూసే అవకాశం నాకు గువాహటిలో లభించింది. 2020 అగ్రిమెంట్‌లో భాగంగా మేం ఇచ్చిన హామీలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలుచేసి తీరుతాం. బోడో భాషకు ఇప్పటికే సహ అధికార భాష హోదాను ఇచ్చాం. బోడోల్యాండ్ వికాసానికి రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చాం. ప్రస్తుతం కోక్రఝర్‌లో ఒక మెడికల్ కాలేజీ కూడా ఉంది. ఇళ్లకు తిరిగొచ్చిన కుమారుల తల్లులు అందరూ నాకు దీవెనలు ఇస్తున్నారు. ఆ యువకులంతా ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా, శాంతితో జీవిస్తున్నారు" అని ప్రధాని మోదీ తెలిపారు.

**ప్రధాని ప్రారంభించిన ప్రాజెక్టులివీ**

అసోంలోని కోక్రఝర్ జిల్లాకు సంబంధించిన రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు.

కోక్రఝర్ జిల్లా బాష్‌బరీలో రైల్వేశాఖకు చెందిన పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా రైళ్ల నిర్వహణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి.

ప్రధాని పచ్చజెండా ఊపి కోక్రఝర్ జిల్లాతో పాటు ఈశాన్య రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచే మూడు కొత్త రైలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ మూడు రైలు సర్వీసుల్లో కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గువహటి – న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్, నారంగి – అగర్తలా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.

కామాఖ్య – చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది ఈశాన్య రాష్ట్రాలతో దక్షిణ భారతదేశాన్ని లింక్ చేస్తుంది.

ఈ కొత్త రైలు సర్వీసులు అసోంలో టూరిజం, రవాణా, వ్యవసాయం, గ్రామీణ వికాసాలకు ఊతం ఇస్తాయి.

అసోం మాలా 3.0 అనే ప్రధానమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులకు ప్రధాని మోదీ శుక్రవారం భూమిపూజను నిర్వహించారు. రూ.3,200 కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా అసోంవ్యాప్తంగా 900కుపైగా కి.మీ రోడ్లను నిర్మించనున్నారు. నేషనల్ హైవేలను, గ్రామీణ రోడ్లతో అనుసంధానించనున్నారు.

బోడోలాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ ఏరియాలో 6 రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజను నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,100 కోట్లతో నాలుగు ఫ్లై ఓవర్లు, రెండు బ్రిడ్జిలను నిర్మించనున్నారు.

ఇక మార్చి 14న (శనివారం రోజు) అసోంలోని సిల్చార్‌లో వివిధ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజ నిర్వహించనున్నారు. పనులు పూర్తయిన పలు ప్రాజెక్టులను దేశానికి అంకితం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ.23,550 కోట్లు.

వచ్చే నెలలోనే అసోం ఎన్నికలు?

వచ్చే (ఏప్రిల్) నెలలోనే అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం రోజే అసోంకు ప్రధాని మోదీ చేరుకున్నారు. ఇప్పటికే వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారి అసోం అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలనే సంకల్పంతో మోదీసేన ఉంది.

## దేశరైతులను ఆదుకోవడానికి కృషి

ఎన్డీఏ ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి, దేశం స్వయం సమృద్ధి సాధించడానికి కృషి చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ మరోసారి దేశం పట్ల తమ నిబద్ధత లోపాన్ని ప్రదర్శించిందని ప్రధాని మోదీ ఆరోపించారు. యుద్ధాల వల్ల తలెత్తిన సంక్షోభ సమయాల్లో కూడా కాంగ్రెస్ తప్పుడు సమాచారాన్ని, అసత్యాలను ప్రచారం చేయడానికే పరిమితమైందని విమర్శించారు. అసోంలోని గువాహటిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. అక్కడి నుంచే దేశవ్యాప్తంగా అర్హులైన 9.3 కోట్లకు పైగా రైతులకు పీఎం కిసాన్ పథకం కింద 22వ విడత నిధులను విడుదల చేశారు. "మేము టీ తోట కార్మికులకు భూమి పట్టాలు ఇచ్చాం. వారికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని అంతం చేశాం. వాస్తవానికి టీ తోట కార్మికులకు భూమి పట్టాలు ఇవ్వడం ద్వారా నా రుణాన్ని తీర్చుకుంటున్నాను. మీరు ఉత్పత్తి చేసిన టీని అమ్మడం ద్వారా నేను ఈ స్థానానికి చేరుకున్నాను. నాకు మీ ఆశీస్సులు ఉన్నాయి. అసోం అన్ని ఈశాన్య రాష్ట్రాలకు ఒక మోడల్‌గా మారుతోంది. గత పదేళ్లలో అసోంలో జరిగిన అభివృద్ధిని చూసి బంగాల్ ప్రజలు రాబోయే ఎన్నికల్లో బీజేపీ సర్కార్‌ను కోరుకుంటున్నారు. "

**వారి కోసం కాంగ్రెస్ ఏం చేయలేదు : మోదీ**

టీ తోట కార్మికులకు భూమి హక్కులను అందించడం ద్వారా అసోంలోని ఎన్డీఏ సర్కార్ ఆ సమాజానికి జరిగిన చారిత్రక అన్యాయాన్ని అంతం చేస్తోందని మోదీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అసోంలో అధికారంలో ఉన్నప్పుడు టీ తోట కార్మికులను ఎప్పుడూ పట్టించుకోలేదని ఆరోపించారు. భారత్‌ను దశాబ్దాలుగా విదేశాలపై ఆధారపడేలా కాంగ్రెస్ చేసిందని, కానీ ఎన్డీఏ ప్రభుత్వం దానిని క్రమంగా మార్చిందని వెల్లడించారు.

## తప్పనిసరి నెలసరి సెలవులపై పిటిషన్



మహిళల నెలసరి సెలవులకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళా విద్యార్థులు, కార్మికులకు నెలసరి సెలవులు కల్పించే దేశవ్యాప్త విధానాన్ని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) స్వీకరించడానికి అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. రుతుక్రమ సెలవులు తప్పనిసరి చేస్తే ఎవరూ వారికి ఉద్యోగాలు ఇవ్వరని అభిప్రాయపడింది. అలాంటి చట్టం చేస్తే తాము పురుషుల కంటే తక్కువ అన్న భావన మహిళల్లో కలిగే అవకాశం ఉందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ బెంచ్ అభిప్రాయపడింది. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదంటూ ఫిటిషన్ దారును ఉద్దేశించి వ్యాఖ్యానించింది.

**ఆ చట్టాన్ని తీసుకువస్తే, ఎవరూ వారిని నియమించుకోరు!**

విచారణ సందర్భంగా, చట్టం ద్వారా నెలసరి సెలవులను తప్పనిసరి చేయడం వల్ల కలిగే సామాజిక పరిణామాల గురించి ప్రధాన న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఆ విషయంలో మహిళల్లో నెలసరి అంశంపై అవగాహన కల్పించడం వేరని, దానిని సెన్సేషన్ చేయడం వేరని బెంచ్? పేర్కొంది. ఒకవేళ నెలసరి సెలవును తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తీసుకువస్తే, ఆ మరుక్షణమే ఎవరూ వారిని నియమించుకోరని తెలిపింది. ఈ సందర్భంగా, పిటిషనర్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఎం ఆర్ షంషద్, కొన్ని రాష్ట్రాలు, సంస్థలు ఇప్పటికే రుతుక్రమ సెలవులను కల్పించడానికి చర్యలు తీసుకున్నాయని ఆయన ఎత్తి చూపారు. అందుకు కేరళలో తీసుకున్న చర్యలను ఉదహరించారు. అక్కడ పాఠశాలల్లో సడలింపులు ప్రవేశపెట్టారని, అనేక ప్రైవేట్ కంపెనీలు స్వచ్ఛందంగా ఉద్యోగులకు సెలవులను అందించాయని ఆయన గుర్తుచేశారు.

**దీనికి బెంచ్ ఏమందంటే?**

ఈ విషయంపై బెంచ్ స్పందిస్తూ, ఆ నిర్ణయాలన్నీ వారు స్వచ్ఛందంగా తీసుకున్నారని సీజేఐ అన్నారు. కానీ చట్టం ద్వారా అలాంటి నిబంధనలను తప్పనిసరి చేయవద్దని హెచ్చరించారు. "సెలవులను వారు స్వచ్ఛందంగా ఇవ్వడం చాలా బాగుంది. చట్టంలో ఇది తప్పనిసరి అని మీరు చెప్పిన వెంటనే, ఎవరూ వారికి ఉద్యోగాలు ఇవ్వరు. న్యాయవ్యవస్థలో లేదా ప్రభుత్వ ఉద్యోగాల్లో వారిని ఎవరూ తీసుకోరు. ఫలితంగా వారి కెరీర్ ముగుస్తుంది" అని సీజేఐ వ్యాఖ్యానించారు. మహిళల పనిప్రదేశాల్లో అవగాహనలపై, అలాగే వృత్తిపరమైన వృద్ధిపై ఇటువంటి చర్యల సంభావ్య ప్రభావాన్ని కూడా ధర్మాసనం హైలైట్ చేసింది.

**గతంలో కూడా ఇలాంటి పిటిషనే ఒకటి!**

గతంలో కూడా మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులను తప్పనిసరి చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో రెండు రాష్ట్రాలు మహిళలకు నెలసరి సెలవులు ఇస్తున్నాయని, మిగతా రాష్ట్రాల్లోనూ దీన్ని పాటించేలా ఆదేశాలు జారీ చేయాలన్న పిటిషన్?ను సుప్రీంకోర్టు నిరాకరించింది. విధానపరమైన నిర్ణయాల్లో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్?ను కొట్టివేసింది. నెలసరి సెలవులు మంచి నిర్ణయమే, అయినప్పటికీ దానివల్ల మహిళలు ఉద్యోగ అవకాశాలకు దూరం కావొచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. అప్పట్లో భారత ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. మహిళలకు నెలసరి సెలవులు ఇస్తే వారు మరింత ఎక్కువగా ఉద్యోగాల్లో చేరేందుకు ప్రోత్సహించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. సెలవులను తప్పనిసరి చేయాలని యజమానులను బలవంతపెడితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని పేర్కొంది. ఫలితంగా, మహిళలను ఉద్యోగాల్లో నియమించుకునే అవకాశాలు కూడా తగ్గొచ్చని తెలిపింది. అయితే, అలాంటి పరిస్థితులను తాము కోరుకోవట్లేదని ధర్మాసనం పేర్కొంది. మహిళల ప్రయోజనాల కోసం కొన్నిసార్లు మనం చేసే ప్రయత్నాలు వారి భవిష్యత్తుకు అడ్డంకిగా మారవచ్చునని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది.

## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అభిశంసనకు ఉభయ సభల్లో విపక్షాల నోటీసులు

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించడానికి ప్రతిపక్షాలు పార్లమెంట్‌లోని ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చాయి. శుక్రవారం లోక్?సభ, రాజ్యసభకు అభిశంసన తీర్మాన నోటీసులు అందజేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపారు. 130 మంది లోక్‌సభ ఎంపీలు, 63 మంది రాజ్యసభ సభ్యులు నోటీసుపై సంతకం చేసినట్లు పేర్కొన్నారు. అయితే సీఈసీపై పార్లమెంటులో నోటీసు ఇవ్వడం ఇదే మొదటిసారి. జ్ఞానేశ్‌కుమార్‌పై పక్షపాతం, ఓట్ల తొలగింపు, అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించడం వంటి 7 అభియోగాలను విపక్షాలు మోపాయి. ఇండియా కూటమిలోని అన్ని పార్టీల ఎంపీలు నోటీసుపై సంతకం చేశారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే కూటమిలో లేని ఆప్?, కొంతమంది స్వతంత్ర ఎంపీలు కూడా సంతకం చేశారని పేర్కొన్నాయి. మరికొంత మంది సంతకం చేసేందుకు ఆసక్తిని వ్యక్తం చేశారని చెప్పాయి. సీఈసీ జ్ఞానేశ కుమార్?పై మొత్తం ఏడు అభియోగాలను నమోదు చేశారు విపక్షాల ఎంపీలు. వాటిలో ముఖ్యంగా ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. విధి నిర్వహణలో పక్షపాత ధోరణి ఎన్నికల్లో అవకతవకలపై దర్యాప్తునకు ఉద్దేశపూర్వకంగా అడ్డుపడటం, పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వంటివి ఆరోపణలు ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించడానికి అనుసరించే ప్రక్రియ ఉంటుంది.

సీమ వార్త
తెలుగు దినపత్రిక

# పాదయాత్రకు పక్కా ప్లాన్

**విజయవాడ :** దయాత్రకు గట్టిగానే ప్లాన్ చేస్తున్నారు. గతంలో ఆయన 16 నెలల పాటు పాదయాత్ర చేశారు. ఈసారి మాత్రం 18 నుంచి 20 నెలల సమయం పట్టే అవకాశం ఉంది ఆయన పాదయాత్రకు. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రారంభించారు. అయితే ఈ పాదయాత్ర మునుపటి మాదిరిగా కొనసాగే అవకాశం లేదు. ఎందుకంటే పాదయాత్ర అంటేనే ఖర్చుతో కూడుకున్న పని. అందుకే ఈసారి ఒక ప్లాన్ చేస్తున్నారట. ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలన్న ఆలోచనతో ఉన్నారట. నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందన్న సమాచారం ఉంది. పాదయాత్ర చేసే సమయానికి పునర్విభజన అనేది ఒక కొలిక్కి రానుంది. తద్వారా పెరిగిన నియోజకవర్గాలతో కలిపి అభ్యర్థులను ప్రకటించనున్నారు జగన్మోహన్ రెడ్డి. తద్వారా పాదయాత్ర బాధ్యతలను వారికి కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది.

2017లో పాదయాత్ర ప్రారంభించారు జగన్మోహన్ రెడ్డి. పార్టీ ప్లీనరీ నిర్వహించి పాదయాత్ర మొదలు పెడుతున్నట్లు ప్రకటన చేశారు. నవరత్నాలు ప్రకటించారు. పనిలో పనిగా వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ను పార్టీ శ్రేణులకు పరిచయం చేశారు. కానీ ఈసారి మాత్రం ఎటువంటి ప్రకటనలు ఉండవని తెలుస్తోంది. నేరుగా పెరిగిన నియోజకవర్గాలతో కలిపి అభ్యర్థులను ప్రకటించి పాదయాత్ర మొదలు పెడతారని తెలుస్తోంది. తద్వారా ముందుగానే టికెట్ల విషయంలో క్లారిటీ ఇస్తే నేతలు బాగా కష్టపడుతారు అనేది ఒక అంచనాగా తెలుస్తోంది. అభ్యర్థులను ముందుగా ప్రకటించడం ద్వారా ఒక ఊపు తేవాలని చూస్తున్నారు. పైగా పాదయాత్రకు ఎటువంటి అడ్డంకులు ఉండకుండా చేయాలని భావిస్తున్నారు. 2023లో లోకేష్ పాదయాత్ర కొనసాగింది. ఆ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉంది. లోకేష్ పాదయాత్రకు ఎన్ని అడ్డంకులు సృష్టించాలో అన్ని సృష్టించారు. అడ్డుకునే ప్రయత్నం చేశారు. చివరకు పాదయాత్రలో మైకులను సైతం తీసుకుపోయారు. వాహనాలను సైతం పట్టుకుపోయారు. పోలీసుల రక్షణ లేకుండా పోయింది. చివరకు లోకేష్ పాదయాత్రను మరింత డామేజ్ చేసేందుకు సోషల్ మీడియా సైన్యం కూడా




రంగంలోకి దిగింది. ఎవరు టిడిపి నేతలు తెలుసుకోలేని పరిస్థితి అప్పట్లో పాదయాత్ర లో ఉండేది. దానిని తట్టుకొని పాదయాత్రను పూర్తి చేయగలిగారు లోకేష్. ఇప్పుడు కచ్చితంగా ఆ పరిస్థితి జగన్మోహన్ రెడ్డికి సైతం ఉంటుంది. మరి ఆయన తట్టుకొని నిలబడగలరా అన్నది చూడాలి. కళ్ళముందు బలమైన అధికారపక్షం ఉంది. గతంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి విడివిడిగా ఉండేవి. తెలుగుదేశం ప్రభుత్వం సైతం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర విషయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. దారి పొడవునా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ ఆస్తులకు పార్టీ రంగులు వేసేసారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్రకు గుర్తుగా వైసీపీ రంగులు వీరవిహారం చేశాయి. అయితే ఈసారి అది వర్కౌట్ కాదు. ఎందుకంటే ప్రభుత్వం ఖచ్చితంగా దృష్టి పెడుతుంది. కేంద్ర ప్రభుత్వం సైతం కలుగజేసుకుంటుంది. అటువంటి చర్యలను మూడు పార్టీలు అడ్డుకుంటాయి కూడా. అందుకే ఈసారి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర పై అనేక రకాల సందేహాలు ఉన్నాయి. వీటికి తోడు అనేక పాత కేసులు తెరపైకి వస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ చాలా ఇబ్బందికరమే. మరి జగన్మోహన్ రెడ్డి ఎలా అధిగమిస్తారో చూడాలి.

# ఏపీకి గుడ్ న్యూస్ చెప్పిన కేంద్రం

**విజయవాడ :** కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో ఏపీకి రిలీఫ్ దక్కింది. జల్‌జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని పెంచడంతో లక్షలాది ఇళ్లకు ప్రయోజనం కలగనుంది. కేంద్రం జలజీవన్ మిషన్ పథకం ద్వారా రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి సౌకర్యం కల్పించి సురక్షితమైన నీటిని అందించాలని టార్గెట్ పెట్టుకుంది. ఏపీలో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని సరిగా అమలు చేయలేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి వాటా నిధులు సరిగా ఇవ్వకపోవడంతో జలజీవన్ మిషన్ పనుల్లో ఆలస్యంకాగా.. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ పథకం గడువు 2024కే ముగిసింది. దీంతో జలజీవన్ మిషన్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఈ పథకంపై ఫోకస్ పెట్టారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సమయంలో జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితిని 2028 వరకు పెంచాలని కోరారు. తాజాగా కేంద్ర కేబినెట్ ఈ జలజీవన్ మిషన్ పథకం గడువును 2028 వరకు పొడిగించింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది ఇళ్లకు ప్రయోజనం కలగనుంది. 2019లో కేంద్రం ఈ జలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. ఆ సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 95లక్షల 53వేల 169 కుటుంబాలు ఉంటే.. ఏపీలో 32.18శాతం ఇళ్లకు కుళాయి సౌకర్యం ఉంది. అయితే గత ఐదేళ్లు పథకాన్ని సరిగా అమలు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. కేంద్రం 2019-20 నుంచి 2024-25 వరకు ఈ పథకాన్నిఅమలు చేసేందుకు మొత్తం



రూ.16,855 కోట్లు కేటాయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.2,324 కోట్లు డ్రా చేసి రూ.2,316 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు ఏకంగా 71లక్షల 52వేల 326 ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించారని చెబుతున్నారు.. అంటే దాదాపు 75శాతం వరకు ఇళ్లకు కుళాయిలు అందుబాటులోకి వచ్చినట్లు లెక్క. తాజాగా కేంద్రం జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితిని పెంచడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 24,00,843 ఇళ్లకు ప్రయోజకనం కలగనుంది. ఈ ఇళ్లకు కూడా కుళాయి సౌకర్యం కల్పించే అవకాశం వచ్చింది. ఇప్పుడు ఈ పథకానికి సంబంధించి మిగిలిన నిధులతో.. మిగిలిపోయిన ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించనున్నారు. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు మాత్రమే 100శాతం గ్రామాల్లో ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించాయి.. మిగిలిన రాష్ట్రాల్లో పనులు జరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా చూస్తే ఏపీ 29వ స్థానంలో ఉంది. ఇప్పుడు పథకం కాలపరిమితి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో.. ఈ పనుల్ని మరింత వేగవంతం చేయనున్నారు.

## మెజారిటీ మంత్రులకు ఉద్వాసన..

# ఈ ఐదుగురికే ఛాన్స్..

**విజయవాడ :** రాజకీయాలు అన్నాక రకరకాల రూమర్లు వస్తుంటాయి. ముఖ్యంగా సర్వే సంస్థలు కొన్ని అంచనాలు వెల్లడిస్తుంటాయి.. అయితే అలా ఫలితాలు విడుదల చేసిన సర్వే సంస్థల విశ్వసనీయత బట్టి అవి ఆధారపడి ఉంటాయి. నమ్మాలా వద్దా అనేది ఎదుటి వ్యక్తి నమ్మకం బట్టి ఉంటుంది. అయితే తాజాగా సర్వేలు నిర్వహించే రైజ్ సంస్థ నిర్వాహకుడు ప్రవీణ్ పుల్లట రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగాదికి కానీ.. తరువాత కానీ మంత్రివర్గ విస్తరణ ఖాయమని చెబుతున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలోకి ఓ ఐదుగురిని తీసుకోవడం ఖాయమని చెప్పుకొస్తున్నారు. ఆయన పేరుతో సోషల్ మీడియాలో ఒక పోస్టు పెట్టారు. విపరీతంగా వైరల్ అవుతుంది. 2024 జూన్ 4న ఫలితాలు వచ్చాయి. అదే నెల 12న ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఓ 24 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఒక మంత్రి పదవిని ఖాళీగా ఉంచారు. పవన్ కళ్యాణ్ కీలకమైన నాలుగు శాఖలకు మంత్రి బాధ్యతలు తీసుకోవడంతో పాటు డిప్యూటీ సీఎం హోదా కూడా తీసుకున్నారు.. అయితే ఖాళీగా ఉన్న మంత్రి పదవి ఎమ్మెల్సీ నాగబాబుతో భర్తీ చేయనున్నారు. అదే సమయంలో కొత్తగా ఓ ఐదుగురిని మంత్రివర్గంలోకి తీసుకోనున్నారు. ప్రవీణ్ పుల్లట ఇదే విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ బెందాళం అశోక్, పల్లా శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, వేమిరెడ్డి లను రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారని డాక్టర్ ప్రవీణ్ పుల్లట వెల్లడించారు. ఇందులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన బెందా ళం అశోక్ ఇచ్చాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు గెలిచారు. సౌమ్యుడుగా పేరు ఉంది.



ఈసారి ఆయనకు చాన్స్ ఇస్తారని తెలుస్తోంది. ఒకవైపు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని సమాచారం. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారు శ్రీనివాస్. మంత్రివర్గంలోకి తీసుకుంటారని భావించిన చివరి నిమిషంలో రాష్ట్ర అధ్యక్ష పదవి అప్పగించారు. విస్తరణలో ఆయనకు తప్పకుండా ఛాన్స్ ఇస్తారని ప్రవీణ్ పుల్లట చెబుతున్నారు. అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు సైతం ఛాన్స్ ఉండనుంది. ఇప్పటికీ ఆయన సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. గతంలో మంత్రి పదవి చేపట్టారు. మరోవైపు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు ఛాన్స్ ఇస్తారని చెబుతున్నారు. ఆయన చంద్రబాబుతో పాటు లోకేష్ కు సన్నిహితుడు. పార్టీకి విలువైన సేవలు అందించారు. మరోవైపు నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఛాన్స్ తప్పకుండా దక్కుతుందని చెబుతున్నారు. ఆమె భర్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు. ఎన్నికలకు ముందు తన భార్యతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు ఆమెను మంత్రివర్గంలోకి తీసుకుంటారని ప్రవీణ్ పుల్లట చెప్పుకొస్తున్నారు. గతంలో ఎన్నికలకు ముందు టిడిపి కూటమికి అనుకూలమైన ఫలితాలు ఇచ్చారు ప్రవీణ్ పుల్లట. అవి నిజమని తేలాయి. అందుకే ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి ఆయన మాటలు.

## రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్

-మొదటిపేజీ తరువాయి

అమరావతిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ ప్రతిపాదనకు ఆమోదం. ఎఫ్‌ఆర్‌ఏ పట్టాదారులకు రాయితీలు కల్పించే ప్రతిపాదనలకు ఆమోదం. మిషన్ శక్తి కింద ' సఖీ నివాస్' పేరుతో పనిచేసే మహిళల కోసం క్రెచ్ సౌకర్యాలతో హాస్టళ్లు. తిరుపతి, విజయవాడ, విశాఖ అప్పీల్ కార్యాలయాల పరిధిపై నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్ట గెజిట్‌కు ఆమోదం. పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలు చేర్చే ప్రతిపాదనలను కేంద్రానికి పంపే అజెండాకు అమోదం తెలిపారు. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యవసర మరమ్మతు పనులకు నిధుల మంజూరు. క్యాబినెట్‌లో అజెండా అంశాలు ముగిసిన తర్వాత వివిధ అంశాలపై సీఎం చర్చించారు. గ్యాస్ కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు గ్యాస్‌కు బదులుగా ఎలక్ట్రిక్ స్టవ్‌లు వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎలక్ట్రిక్ స్టవ్‌లతో విద్యుత్ డిమాండ్ పెరగడంతో పరిస్థితి పర్యవేక్షించాలని సీఎం సూచించారు. ఏప్రిల్ 2న శాఖల పనితీరుపై నివేదికలు ఇస్తానని, వాటి ఆధారంగా సమీక్ష చేసుకొని పురోగతి సాధించాలని సూచించారు. ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం చేపట్టాలన్నారు. కాలువలు, డ్రెయిన్లు శుభ్రం చేయించి భూగర్భ జలాలను పెంచాలన్నారు. మే 15 నాటికి సాగునీరు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. చివరి ఎకరానికి కూడా నీరిచ్చేలా జలధార కార్యక్రమం జరగాలని సీఎం ఆదేశించారు.

## ఏపీ హై కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ బాధ్యతల స్వీకరణ

-మొదటిపేజీ తరువాయి

సింగ్ ఠాకూర్ ఏప్రియల్ నెలలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో అనంతరం ఏపీ హై కోర్టుకు మొదటి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ వ్యవహరించనున్నారు. జస్టిస్ లీసా గిల్ స్వస్థలం చండిగఢ్ కాగా పంజాబ్ యూనివర్సిటీ నుండి ఎల్‌ఎల్బీ, ఎల్ ఎల్ ఎం పూర్తి చేశారు. 1990లో న్యాయవాదిగా పంజాబ్ హర్యానా హై కోర్టు లో ప్రాక్టీస్ ప్రారంభించారు. 2014 మార్చి 31న పంజాబ్ హర్యానా హై కోర్టు న్యాయమూర్తిగా నియామకం అయ్యారు. ఈకార్యక్రమంలో హై కోర్టు న్యాయమూర్తులు, అడిషినల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడ్వకేట్స్ అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ కేవీ రఘు కుమార్, బార్ కౌన్సిల్ ఛైర్మన్ ద్వారకానాథ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీ నారాయణ, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో బిట్స్ పిలానీ 'ఏఐ ప్లస్ క్యాంపస్'

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. ఈ క్యాంపస్?పై వచ్చే ఐదేళ్లలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి పెడతామని చెప్పారు. సీఎం చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో ఈ క్యాంపస్ నిర్మిస్తున్నట్లు వివరించారు. నిర్మాణంలో గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి పర్యావరణహిత విధానాలను పాటిస్తున్నామన్నారు. అమరావతి బిట్స్ దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్?గా ఉండబోతోందని వెల్లడించారు.

### మంత్రి లోకేశ్ సంతృప్తి

అధునాతన సాంకేతికలతో పాటు వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వంటి కోర్సులు కూడా ఇక్కడ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు బిట్స్ ప్రతినిధులు తెలిపారు. బిట్స్ నిర్మాణ ప్లాన్లను పరిశీలించిన మంత్రి లోకేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా అమరావతి క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. బిట్స్ పిలాని ప్రతినిధులు అంతకుముందు మంత్రి నారాయణను కలిశారు. అమరావతి క్యాంపస్?లో నిర్మించే భవనాల డిజైన్లను మంత్రి నారాయణకు వివరించారు. రెండున్నరేళ్లలో మొదటి దశ అడ్మిషన్లకు సిద్ధం చేస్తామని మంత్రికి తెలిపారు. మందడం, వెంకటపాలెం మధ్య సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కనే 70 ఎకరాల్లో బిట్స్ క్యాంపస్ నిర్మాణం కానుంది.

### 7000 మంది విద్యార్థులకు అవకాశం

అమరావతిలో ఏఐ ప్లస్ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నట్లు బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్-బిట్స్ విశ్వవిద్యాలయ కులపతి, పారిశ్రామికవేత్త కుమారమంగళం బిర్లా ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. 7000 మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా కేంద్రాన్ని తీర్చిదిద్దుతామని, 2027 నుంచి ప్రవేశాలు ప్రారంభిస్తామని తెలిపారు. అమరావతి క్యాంపస్‌ను ఆధునిక సాంకేతిక విద్యాకేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కృత్రిమ మేథ, డేటాసైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులకు ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు.

### రూ.1,000 కోట్ల పెట్టుబడులు

స్మార్ట్, సుస్థిర మౌలిక సౌకర్యాలతో 2 దశల్లో 7000 మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా కేంద్రాన్ని రూపొందిస్తామని కుమారమంగళం బిర్లా అన్నారు. అమరావతిలో వచ్చే 5 ఏళ్లలో 1000 కోట్ల రూపాయల పెట్టుబడి పెడతామని ప్రకటించారు. అమరావతిలో బిట్స్ క్యాంపస్ ఉండాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని వెల్లడించిన కుమారమంగళం బిర్లా తక్కువ ధరకే భూములిచ్చారని తెలిపారు. అమరావతి క్యాంపస్ సీఎం దార్శనికతను ప్రతిబింబించేలా ఉంటుందని అన్నారు. గ్రీన్ బిల్డింగ్స్, పునరుద్పాదక విద్యుత్ విధానాలతో నిర్మాణాలు చేస్తామని పేర్కొన్నారు.

### 70 ఎకరాలు కేటాయింపు


బిట్స్ అమరావతి క్యాంపస్ ఏర్పాటుకు సీఆర్?డీఏ 70 ఎకరాలు కేటాయించింది. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో స్థలం కావాలని బిట్స్ కోరింది. తమ సంస్థ భవనాలనూ ఆలయ నమూనాలో నిర్మిస్తామని తెలిపింది. దీంతో వారు కోరిన ప్రాంతంలోనే ప్రభుత్వం భూములు కేటాయించింది. ఇటీవల సీఎం చంద్రబాబు వద్ద కూడా దీనిపై చర్చ జరిగింది. బిట్స్ క్యాంపస్ నమూనాలను ఆయన పరిశీలించారు.

## ఏపీలో టైటానియం ఉత్పత్తి

-మొదటిపేజీ తరువాయి

తీసుకువచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు టైటానియం పిగ్మెంట్ మెటల్?ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇలిమనైట్‌ని వేరుచేసి ఎగుమతి: బీచ్?శాండ్ తవ్వకాలను చేసినట్లయితే అందులో 90 శాతం వృథా శాండ్ ఉంటుంది. ఇక మిగిలినటువంటి 10 శాతంలో ఇలిమినైట్, రూటైల్, గార్నెట్, సిలిమనైట్, జిర్కాన్, మోనజైట్ వంటి తదితర ఖనిజాలు లభ్యమవుతాయి. ఒకవేళ వీటిని వేరుచేయాలంటే మినరల్ సెపరేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం మాత్రం ఇలిమనైట్?ని వేరుచేసి ఒడిశా, తమిళనాడు, కేరళ నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రముఖ దేశాలైన చైనా, జపాన్, రష్యా వంటి చోట్ల ఇలిమనైట్?ను శుద్ధిచేసి, కీలకమైనటువంటి టైటానియం పిగ్మెంట్ మెటల్?ను తయారుచేస్తున్నారు. అదే విధంగా ఆ టైటానియం మెటల్?ను మనం పలు దేశాల నుంచి తిరిగి మళ్లీ దిగుమతి చేసుకుంటున్నాం. దీంతో ఇలిమనైట్?ను శుద్ధిచేసి ప్లాంట్ ఇక్కడే ఏర్పాటు చేసి ఇచ్చోటే ముడి టైటానియం పిగ్మెంట్ మెటల్ తయారయ్యే విధంగా చూడాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇక ఒడిశాలో ఇండియన్ రేర్? ఎర్త్ మినరల్ (ఐఆర్?ఈఎల్) కు చెందిన బీచ్?శాండ్ మినరల్స్ సెపరేషన్ ప్లాంట్?ను తాజాగా గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్? కుమార్ మీనా ఉన్నతాధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. కేంద్ర ప్రకటనతో చిగురించిన ఆశలు: తమిళనాడు, కేరళలో ఉన్న ప్లాంట్లతో పాటుగా విదేశాల్లోని టైటానియం ప్లాంట్లను సమగ్రంగా పరిశీలించాల్సిందిగా అధికారులు భావిస్తున్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్?లో ఏపీ, ఒడిశా, తమిళనాడు, కేరళ స్టేట్స్?లో రేర్ ఎర్త్ మినరల్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించింది. బీచ్?శాండ్?లోని ఉన్నటువంటి కొన్ని ఖనిజాలు రేర్ ఎర్త్ మినరల్స్ కిందకు వస్తాయి. ఇందులో పెట్టుబడులను పెట్టే సంస్థలకు కేంద్రం అనేకమైన రాయితీలను అందించనుంది. దాంతో వాటిని రాష్ట్రప్రభుత్వం పుణికుపుచ్చుకుని ఏపీలోనే వీటి ప్లాంట్?లు ఏర్పాటయ్యే విధంగా చూసుకునేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసింది. దీనివలన రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు రావడంతో సహా భారీగా ఉపాధి అవకాశం సైతం పుష్కలంగా లభిస్తాయి. 16 బీచ్‌శాండ్ బ్లాక్‌లను గుర్తించిన ప్రభుత్వం: ముఖ్యంగా ఏపీలోని శ్రీకాకుళం నుంచి కృష్ణాజిల్లా వరకు 16,600 హెక్టార్ల పరిధిలో 16 బీచ్?శాండ్ బ్లాక్‌లను రాష్ట్రప్రభుత్వం గుర్తించింది.

సీమ వార్త
తెలుగు దినపత్రిక





## మళ్ళీ సైన్స్ ఫిక్షన్ ప్రపంచంలోకి స్పీల్‌బర్గ్..

హాలీవుడ్ లెజెండరీ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ 79 ఏళ్ల వయసులో కూడా తనదైన మార్కు సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌తో అందరిని షాక్‌కి గురిచేస్తున్నాడు. ఆయ న దర్శకత్వంలో రాబోతున్న చిత్రం "డిస్క్లోజర్ డే" ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ట్రైలర్ గురువారం విడుదలై ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. 'ఈటీ', 'క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ది థర్డ్ కైండ్', 'ఏఐ' వంటి ఆల్-టైమ్ క్లాసిక్స్ తర్వాత స్పీల్‌బర్గ్ మళ్లీ ఏలియన్స్ నేపథ్యమున్న కథను ఎంచుకోవడం విశేషం. ఈ చిత్రంలో ఎమిలీ బ్లంట్ వాతావరణంకి సంబంధించిన విషయాలను చెప్పే రిపోర్టర్‌గా నటిస్తుండగా, ప్రభుత్వం రహస్యంగా దాచిన గ్రహాంతరవాసుల నిజాలను ప్రపంచానికి వెల్లడించే క్రమంలో ఎదురయ్యే ఉత్కంఠభరిత పరిణామాలను ఈ సినిమా చూపించనుంది. ముఖ్యంగా ట్రైలర్‌లో లైవ్ బ్రాడ్‌కాస్టింగ్ సమయంలో ఎమిలీ బ్లంట్ అదృశ్య శక్తుల ప్రభావానికి గురయ్యే సన్నివేశాలు హారర్ మరియు థ్రిల్లింగ్ అనుభూతిని కలిగిస్తున్నాయి.




## యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా 'యూత్'

కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్'.ఈ చిత్రాన్ని ఇదే పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. త్వరలోనే 'యూత్' మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో కిరణ్ అబ్బవరం లాంచ్ చేశారు. అనంతరం టీమ్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. మలయాళ బ్లాక్ బస్టర్ ప్రేమలు తెలుగులోనూ ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇలాంటి తరహా కంటెంట్ తోనే వచ్చిన లిటిల్ హార్ట్స్ కూడా పెద్ద సక్సెస్ దక్కించుకుంది. ఇప్పుడు తెలుగు ఆడియెన్స్‌కు కావాల్సిన యూత్ ఫుల్ రొమాంటిక్ ఎంటర్ టైనర్ జానర్‌లో వస్తున్న "యూత్" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే అలాంటి వైబ్స్ క్రియేట్ చేస్తోంది.



## 'కాలరే ఎత్తరా'.. అంటున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'

'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తర్వాత పవర్ స్టార్ పవన్ కల్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు ఇందులో నుంచి విడుదలైన ప్రతి పాట, టీజర్ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకున్నాయి. ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ తాజాగా చిత్రబృందం మూడో గీతం 'కాలరే ఎత్తరా'ను విడుదల చేసింది. ఈ పాట విడుదలతో సినిమాపై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. భారీ స్థాయిలో రూపొందించిన ఈ పాటలో భారీ సెట్‌లు, కట్టిపడేసే విజువల్స్, అద్భుతమైన ఎనర్జీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా పవన్ కల్యాణ్ తన ప్రత్యేకమైన స్టైల్, ఎనర్జీ, డ్యాన్స్ స్టెప్పులతో తెరపై వెలుగులు నింపారు. కాగా.. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని యూ/ఏ సర్టిఫికెట్‌ను సొంతం చేసుకుంది. మార్చి 14వ తేదీన ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయనుంది చిత్రబృందం. అనంతరం మార్చి 15వ తేదీన భారీ ప్రీ-రిలీజ్ వేడుకను నిర్వహించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మూవీ మార్చి 19వ తేదీన థియేటర్లలో అడుగుపెట్టనుంది.



## డెకాయిట్‌పై ఎక్స్‌పెక్టేషన్స్ పెంచేసిన హీరో కామెంట్స్

బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో అలరిస్తున్న హీరో అడివి శేష్ ఇప్పుడు కొత్త అవతార్‌లో డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ మూవీ ఏప్రిల్ 10న రాబోతున్నది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రాగా.. షూటింగ్ పూర్తి చేసుకన్న సదర్భంగా సినిమా విశేషాలు పంచుకున్నాడు అడివి శేష్. 'డెకాయిట్ ఒక కొత్త జోనర్‌లో చేసిన సినిమా.



## మరోసారి అందాలతో ఎటాక్

మోస్ట్ బ్యూటిఫుల్ నటి సాక్షి అగర్వాల్ గురించి తెలుగు ప్రేక్షకులకు పెద్దగా పరిచయం లేకపోవచ్చు. ఈమె ఎక్కువ శాతం తమిళ సినిమాల్లో నటించింది. ఆ తర్వాత కన్నడ, మలయాళ చిత్రాల్లో నటించింది. 2013లో వచ్చిన రాజా రాణి చిత్రంతో ఈ ముద్దుగుమ్మ వెండితెరకు పరిచయం అయింది. అంతకుముందు పలు టీవీ షోలలో పార్టిసిపేట్ చేసి బుల్లితెర అభిమానులను బాగానే సంపాదించుకుంది. ఈమె ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి చాలా సంవత్సరాలు అవుతున్నా చాలా తక్కువ సినిమాల్లోనే నటించింది. ఈ బ్యూటీ సినిమాల సంఖ్య తక్కువగా ఉన్నా అభిమానులను మాత్రం బాగానే సంపాదించుకుంది. సాక్షి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన ఫోటోలను పోస్ట్ చేస్తూ రోజురోజుకు తన ఫాలోవర్స్ సంఖ్యను పెంచుకుంటూ వస్తుంది.ఈ బ్యూటీ ఇప్పటికీ అనేకసార్లు తన సోషల్ మీడియా అకౌంట్లో హాట్ ఫోటోలను పోస్ట్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అందులో చాలా వరకు వైరల్ కూడా అయ్యాయి. దానితో ఈమెకు ఓ స్టార్ హీరోయిన్ రేంజ్లో ఫాలోవర్స్ ఏర్పడ్డారు. తాజాగా ఈ బ్యూటిఫుల్ నటి తన 'ఇన్ స్టా'లో కొన్ని హాట్ లుక్లో ఉన్న ఫోటోలను పోస్ట్ చేసింది. సాక్షి అగర్వాల్ తాజాగా ఉల్లిపొరలాంటి లైట్ బ్లూ కలర్ శారీని కట్టుకొని, గోల్డ్ కలర్ స్లీవ్ లెస్ బ్లౌజ్ను ధరించి తన బ్యాక్ అందాలు ఫోకస్ అయ్యేలా ఉన్న ఫోటోలను తన ఇన్ స్టా అకౌంట్లో పోస్ట్ చేసింది. ఈ ఫోటోలలో ఈ ముద్దుగుమ్మ ఎక్సలెంట్ గా ఉండడంతో ప్రస్తుతం ఈ నటికి సంబంధించిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకు అనేకమంది బ్యూటిఫుల్, ఆసమ్, లవ్, ఫైర్ ఎమోజీలను కామెంట్లుగా పెడుతున్నారు.



## ఓటీటీలో భారత్-పాక్ యుద్ధ సినిమా.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే

బాలీవుడ్ హిట్ ఫ్రాంఛైజీ చిత్రం బోర్డర్-2 ఓటీటీలోకి రానుంది. ఈమేరకు అధికారికంగా ప్రకటన వచ్చేసింది. సన్నీ డియోల్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా థియేటర్లలోకి వచ్చింది. 1997లో రిలీజై భారీ హిట్ అందుకున్న బోర్డర్ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కించారు. ఇందులో వరుణ్ ధావన్, దిల్జీత్ దొసాంజ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ మూవీని అనురాగ్ సింగ్ దర్శకత్వం వహించారు. 1971 ఇండో-పాక్ యుద్ధం తీవ్రతను, భారత సాయుధ దళాల వీరత్వాన్ని ఈ సినిమా చూపిస్తుంది. అందరిలో దేశభక్తిని రగిల్చేలా ఈ చిత్రం ఉంటుంది. బోర్డర్ 2 మూవీ మార్చి 20 నుంచి నెట్‌ఫ్లిక్స్ (చీవ్‌టశ్రీఱఞ) వేదికగా స్ట్రీమింగ్ కానుంది. అయితే, హిందీ వర్షన్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. సుమారు రూ. 275 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈచిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 485 కోట్లకు పైగానే వసూలు చేసినట్లు తెలుస్తోంది. బోర్డర్ ఫ్రాంఛైజీని కొనసాగిస్తూ మరో చిత్రాన్ని కూడా మేకర్స్ ప్రకటించారు. పార్ట్-1 మాదిరే 'బోర్డర్ 2' కూడా దేశభక్తిని పెంచేలా ఉంటుంది. భారత్‌ను దొంగదెబ్బ కొట్టేందుకు పాకిస్థాన్ 1971లో ఎలాంటి కుట్రలు చేసిందో ఈ చిత్రంలో చూడొచ్చు. భారత్‌పై భూ, జల, వాయు మార్గాల ద్వారా కశ్మీర్, పంజాబ్, గుజరాత్ సరిహద్దుల ద్వారా భారీ దాడులకు దిగుతుంది. అయితే, భారత ప్రభుత్వం దీనిని ముందే గ్రహించి సైనికులను యుద్ధ రంగంలోకి దింపుతుంది. పాక్ సైన్యాన్ని ఎలా మట్టికరిపించారో ఇందులో చూపించారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881